
సాక్షి నిర్మల్

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



**పుస్తకంతో మమేకం**

సర్కారు కొలువే లక్ష్యంగా గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉమ్మడి జిల్లా యువత సిద్ధమవుతున్నారు. రాత్రి పగలు గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

8లో▸



**ఉపాధ్యాయ దినోత్సవం**

జిల్లావ్యాప్తంగా గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

9లో▸

గరిష్టం/కనిష్టం
31.1 /24.4

**వాతావరణం**

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

# ఉత్తపోతలే..!



మాటేగాం ఎత్తిపోతల పథకం



దొడర్నవాగుపై నిర్మించిన కుభీర్ ఎత్తిపోతల పథకం

ఇది భైంసా మండలం మాటేగాం గ్రామం వద్ద చిన్నసుద్ద వాగుపై 1982లో నిర్మించిన ఎత్తిపోతల పథకం. కాలువలు తవ్వి 315 ఎకరాలకు నీరు అందించేవారు. మాటేగాం గ్రామ సమీపంలో వాగుపక్కనే ఇప్పటికీ ఈ పథకానికి సంబంధించి ట్యాంకు ఉంది. నిర్వాహణ లేక పదేళ్లుగా నిరుపయోగంగా మారింది. తవ్విన కాలువలు పూడుకుపోయాయి. ఎత్తిపోతల పథకం సామగ్రి దొంగలపాలవుతోంది.

ఇది కుభీర్ మండలం దొడర్నవాగుపై 1997లో నిర్మించిన కుభీర్ ఎత్తిపోతల పథకం. 200 ఎకరాలకు సాగునీరు అందించేలా కాలువలు తవ్వారు. ప్రస్తుతం దొడర్నవాగులో నిర్మించిన ఇన్‌టెక్ వెల్ నుంచి ఉన్న పైప్‌లైన్ పూర్తిగా ధ్వంసమైంది. వాగుపక్కన ఎత్తిపోతల పథకంలో బిగించిన భారీ మోటార్లు చోరీ అయ్యాయి. అక్కడ పైప్‌లైన్‌లు తప్ప ఏమీ కనిపించడం లేదు. నీటిని తరలించే పైప్‌లైన్‌లు, కాలువలు ధ్వంసమయ్యాయి. పదేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది.

- నిర్వహణలేక నిరుపయోగంగా మారిన లిఫ్ట్‌లు..
- నీరు వృథాగా పోతున్నా.. మళ్లించలేని పరిస్థితి..
- ఇబ్బంది పడుతున్న ఆయకట్టు రైతులు

భైంసా: జిల్లాలో ప్రవహించే గోదావరితోపాటు, వాగుల్లో నీటిని పొలాలకు మళ్లించేందుకు గత ప్రభుత్వాలు నిర్మించిన ఎత్తిపోతల పథకాలు ఉత్తపోతలుగా మారాయి. జిల్లాలో గోదావరి నదితోపాటు జిల్లాలో ప్రవహించే ప్రధాన వాగులపై 42 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంతో దాదాపు అన్నీ నీరున్నా.. ఎత్తిపోయలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పది కూడా పనిచేయడంలేదు.

**అప్పట్లోనే గుర్తించి...**

జిల్లాలో వాగులు, ఒర్రెల ప్రవాహాలపై నీటిని ఒడిసిపట్టి పంటచేలకు అందించాలన్న సంకల్పంతో 42 ఏళ్ల క్రితమే ఉమ్మడి రాష్ట్రంలో అప్పటిపాలకులు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. బోరుబావులులేని రోజుల్లో వాగునీళ్లు ఆపి గట్టుపైనే ఎత్తిపోతల పథకాలను నిర్మించి భారీ మోటార్లతో నీటినితోడి పంటపొలాలకు అందించేవారు. ఆ రోజుల్లో ఎత్తిపోతల పథకం కింద సాగయ్యే భూముల్లోనే రెండు పంటలు పండేవి. కానీ నిర్వహణ లోపంతో జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రధాన పది లిఫ్ట్‌లు 20 ఏళ్ల క్రితమే నీటిని ఎత్తిపోయడం నిలిపివేశాయి. ఇక అప్పట్లో వాగు పరీవాహక ప్రాంతాల్లో 19 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జిల్లాలు విభజించిన తదుపరి ఎత్తిపోతల పథకాల మరమ్మతులుచేపట్టాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగానే అధికారులు సమీప గ్రామాలకు వెళ్లి ఆయకట్టు రైతులతో కలిసి పరిస్థితిని తెలుసుకుని క్షేత్రస్థాయిలో పర్యటించారు. జిల్లాలో పది ఎత్తిపోతల పథకాలను గుర్తించి రూ.249.75 కోట్లతో మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు పంపించారు. కొన్ని చోట్ల పనులు నిర్వహించి వదిలేశారు. పట్టింపులేకపోవడంతో ఈ పథకాలు వృథాగా మారాయి.

**పంటచేలకు వెళ్లేనీరు...**

నిర్మాణాలు పెరగడం, ఆక్రమణలు పెరగడంతో 20 ఏళ్ల క్రితమే భారీ వర్షాలు కురిస్తే వాగులగుండా నీరు సమీప గ్రామాలను, పట్టణాలను ముంచెత్తుతుంది. దీంతో జిల్లా అంతట నీటి లభ్యతలేదని ఎత్తిపోతల పథకాలు పనిచేయవని ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఏటా భారీ వర్షాలు కురుస్తునే ఉన్నాయి. చాలా చోట్ల గత ప్రభుత్వం చెక్‌డ్యాంలు నిర్మించింది. అయినా నీటిని లిఫ్ట్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇలా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తుంది.

**నీటిని ఆపలేక...**

చెక్‌డ్యాంలలో నీటి నిల్వ లేకపోవడంతో వాగులు ఎడారులుగా కనిపిస్తున్నాయి. వర్షం కురిసినప్పుడు నీటిని మోసుకువచ్చే ఈ నదుల్లో రెండు, మూడు రోజుల్లోనే నీటిజాడకనిపించడంలేదు. ఫలితంగా నీటితో వచ్చే ఇసుక అక్రమవ్యాపారంగా మారుతుంది. ఇసుకలేక నీరు భూమిలో ఇంకడంలేదు. భూగర్భజలాలు తగ్గి పక్కనున్న బోరుబావులు కూడా వట్టిపోతున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి చెక్‌డ్యాంలు నిర్మించి ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

**ఇరిగేషన్ కింద తీసుకువచ్చారు...**



ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోనే గతంలో జిల్లా పరిధిలోని ఎత్తిపోతలు ఉండేవి. జిల్లాలో గోదావరి నదితోపాటు ఇతర నదులపై నిర్మించిన 42 ఎత్తిపోతల పథకాలను రెండేళ్ల క్రితం ఇరిగేషన్ శాఖకు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు జిల్లాలో ప్రధాన ఎత్తిపోతల పథకాలపై దృష్టిపెట్టారు. లోకేశ్వరం మండలం కనకాపూర్, పంచగూడి, గడ్‌చాంద ఎత్తిపోతల పథకాలు బాగానే పనిచేస్తున్నాయి. అక్కడి రైతులు నిర్వాహణ చూస్తూ అధికారులను కలుస్తూ ఈ పథకాలను బాగా కాపాడుకుంటున్నారు. ఎత్తిపోతల పథకం కింద వచ్చే నీటితోనే రెండు పంటలు పండించుకుంటున్నారు. ఇటీవలే ఇరిగేషన్ అధికారులు మస్కద్, ఎడ్బూర్, పాట్‌పెల్లితోపాటు పలు ఎత్తిపోతల పథకాల నిర్వాహణపై ప్రతిపాదనలు పంపించారు. కుభీర్ మండలంలో మూలన పడ్డ ఎత్తిపోతల పథకం పనిచేసేలా నిధులు ఇవ్వాలని ప్రతిపాదించారు.

**గతంలో ఇలా..**

- ముధోల్ నియోజకవర్గంలో చిన్న సుద్ద వాగుపై భైంసా మండలం మాటేగాం గ్రామంలో 1982లోనే ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఈ పథకం కింద 315 ఎకరాలకు నీరు అందించేవారు.
- 1983లో దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలో స్వర్ణవాగుపై ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఈ పథకం కింద 560 ఎకరాలకు సాగునీరు అందేది.
- 1984లో నిర్మల్ మండలం స్వర్ణవాగుపై చిట్యాల ఎత్తిపోతల పథకం నిర్మించారు. 610 ఎకరాలకు సాగునీరు అందించేవారు.
- 1991లో కుభీర్ మండలంలో సుద్ద వాగుపై నిగ్వా ఎత్తిపోతల పథకం నిర్మించి 800 ఎకరాలకు సాగునీరు అందించారు. 1993లో కడెం నదిపై ఖానాపూర్ మండలం ఇటిక్యాల ఎత్తిపోతల పథకం నిర్మించి 118 ఎకరాలకు సాగునీరు అందించారు.
- 1997లో దొడర్నవాగుపై కుభీర్ మండల కేంద్రంలో కుభీర్ ఎత్తిపోతల పథకం నిర్మించి 200 ఎకరాలకు సాగునీరు అందించారు.
- 1999లో చెలిమెల వాగుపై లక్ష్మణచాంద మండలం న్యూవెల్మల్ ఎత్తిపోతల పథకం నిర్మించి 300 ఎకరాలకు సాగునీరు అందించారు.
- 1998లో లోకల్‌వాగుపై నిర్మల్ మండలం భాగ్యనగర్ ఎత్తిపోతల పథకం నిర్మించి 200 ఎకరాలకు సాగునీరు అందించారు.
- 2003లో లక్ష్మణచాంద మండలం తిర్పెల్లిలో ఖానాపూర్‌వాగుపై ఎత్తిపోతల పథకం నిర్మించి 325 ఎకరాలకు సాగునీరు అందించారు.
- 2003లో ఖానాపూర్ వాగుపై లక్ష్మణచాంద మండలం రత్నాపూర్‌కాండ్లీలో ఎత్తిపోతల పథకం నిర్మించి 500 ఎకరాలకు సాగునీరు అందించారు.

## ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



శోభాయాత్ర మార్గం పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, చిత్రంలో ఏఎస్పీ అవినాష్ కుమార్

భైంసాటౌన్: పట్టణంలో వినాయక నవరాత్రోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. ఏఎస్పీ అవినాష్‌కుమార్‌తో కలిసి పట్టణంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర మార్గంలో గురువారం పర్యటించారు. గణేశ్‌నగర్‌లోని మున్నూరుకాపు సంఘ భవనం నుంచి పంజేషచౌక్ మీదుగా, బీఫ్ మార్కెట్ వరకు నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. శోభాయాత్ర మార్గంలో రోడ్లపై గుంతలు, పారిశుద్ధ్యం, విద్యుత్ లూజ్ తీగలు, వీధి దీపాలు తదితర సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నిమజ్జన ఘాట్‌కు చేరుకున్నారు. నిమజ్జనం సందర్భంగా ప్రమాదాలు జరుగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట ఆర్డీవో కోమల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్, సీఐ రాజారెడ్డి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

**రోగులకు మెరుగైన వైద్యం అందించాలి**

భైంసాటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. పట్టణంలోని ఏరియాస్పత్రిని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఇన్‌పేషెంట్, ప్రసూతి, టీకాల గది, మందుల గది పరిశీలించారు. వార్డుల్లో తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ కాశీనాథ్, వైద్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైద్యులు సమయ పాలనను పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆమె వెంట ఆర్డీవో కోమల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

**రేషన్ కార్డులు జారీ చేయాలి**

నిర్మల్‌టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయాలని, రేషన్ కార్డులు జారీ చేయాలని నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయన్నారు. వాటిని ప్రభుత్వాలు కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌ఆర్.ఉపాలి, ఏఎస్.రెడ్డి, భూక్య రమేశ్, ఇస్తారి, నవీన్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### గుండంపల్లి 'ఇథనాల్' వ్యతిరేక దీక్షలు



గుండంపల్లి గ్రామంలో దీక్షకు కూర్చున్న రైతులు

దిలావర్‌పూర్: తమ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీనీ తరలించాలని గుండంపల్లి గ్రామంలో గురువారం నుంచి రిలే దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా మొదటిరోజు ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు ఎల్లాల చిన్నారెడ్డి, బుచ్చారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రైతులు పాల్గొని ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని పంటచేలలో తమ గుండంపల్లి-దిలావర్‌పూర్ గ్రామాల నడుమ నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ కారణంగా తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణం ఆపి వేరే ప్రాంతానికి తరలించాలిని డిమాండ్ చేశారు.

### నేడు ఉద్యమకారుల సర్వసభ్య సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర చైతన్యయాత్ర పురస్కరించుకుని జిల్లా ఉద్యమకారుల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం టీఎన్జీవో సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా చైర్మన్ కొట్టె శేఖర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి ఉద్యమకారుడు ఉద్యమకాలంలో పత్రికల్లో వచ్చిన ఫొటోలు, ప్రకటనలు, పోలీసు కేసులకు సంబంధించిన వివరాలతో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. వచ్చే సోమవారం ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమకారుల చైతన్య యాత్ర నిర్మల్ చేరుకుంటుందని పేర్కొన్నారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఖానాపూర్: అటవీశాఖ పరిధిలోని బేస్ క్యాంపు, ఎనిమల్ ట్రాకర్స్, చెక్‌పోస్ట్ వాచర్స్‌గా విధులు నిర్వహిస్తున్న తమకు 7 నెలలుగా వేతనాలు చెల్లించలేదని, వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మల్ డీఎఫ్‌వో నాగిని భానుకు గురువారం వినతిపత్రం అందజేశారు. వేతనాలు రాక ఇళ్లు గడవడం కూడా కష్టంగా మారిందని పేర్కొన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని లేకపోతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ప్రతీ నెల ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వడంతోపాటు సమానపనికి సమానవేతనం అమలు చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నారపాక స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగావత్ ఉపేందర్, నాయకులు సంజీవ్, రమేశ్, శివ, భక్షి ఉన్నారు.

### నీటి కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సరస్వతీనగర్ గ్రామస్తులు

ముధోల్: మండలంలోని ముద్గల్ గ్రామపంచాయతీ అనుబంధ సరస్వతీనగర్ గ్రామానికి కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని గురువారం ఆందోళన చేశారు. భైంసా - బాసర ప్రధాన రహదారిపై సరస్వతీ నగర్‌ఎక్స్ రోడ్డు వద్ద ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. సమస్యను మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. సుమారు అరగంటపాటు రాస్తారోకో చేపట్టడంతో సీఐ మల్లేశ్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్సై సాయికిరణ్, ఎంపీడీవో శివకుమార్ సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులు మాట్లాడారు. తహసీల్దా ర్ మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సరఫరా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

### షెడ్ల యజమానులతో సమావేశం

కుభీర్: కుభీర్‌లో మురుగునీటి కాల్వలపై అక్రమంగా షెడ్లు వేసుకున్న వ్యాపారులతో అధికారులు గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. షెడ్ల కారణంగా ఆస్పత్రిలో నీళ్లు వస్తున్నాయన్నారు. వ్యాపారులు స్వచ్ఛందంగా షెడ్లు తొలగించాలని సూచించారు. షెడ్లు తొలగించిన తర్వాత డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తామని పేర్కొన్నారు. కొందరు కోర్టులో కేసు ఈ నెల 11 పరిష్కారం ఉందని, ఆ తరువాత చూస్తామని చెప్పారు. స్వచ్ఛందంగా తొలగిస్తామని కొందరు సంతకాలు చేశారు. తహసీల్దార్ సోము, డీఎల్‌పీవోసుదర్శన్ పటేల్, ఎంపీడీవో మోహన్‌సింగ్, ఈవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

# జిల్లాకు నిడ్రా!



ఆక్రమణకు గురవుతున్న నిర్మల్ పట్టణంలోని చెరువు

- హైడ్రా తరహా పవర్స్‌తో ఏర్పాటు
- సీఎం ప్రకటనతో నిడ్రాపై ఆశలు
- ఆక్రమణలపై జిల్లావ్యాప్తంగా చర్చ

నిర్మల్: హైదరాబాద్‌లో చెరువులు, నాలాల కబ్జాలపై విరుచుకుపడుతున్న హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) తరహా వ్యవస్థను జిల్లాల్లోనూ ఏర్పాటు చేస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. నిర్మల్ గొలుసుకట్టుతోపాటు జిల్లాలోని చాలా చెరువులు కబ్జాల పాలయ్యాయి. కళ్లముందే చారిత్రక చెరువులు, కందకాలు కనుమరుగవుతున్నా.. రాజకీయ ఒత్తిళ్లతో స్థానిక అధికారులు పెద్దగా స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. లేక్ కమిటీ చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో ఆక్రమణలపై దృష్టి పెట్టలేకపోతోంది. ఈక్రమంలోనే హైడ్రా తరహాలో పూర్తిస్థాయిలో కబ్జాల తొలగింపు కోసం 'నిడ్రా'(నిర్మల్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) కావాలన్న డిమాండ్ పెరుగుతోంది.

**నిడ్రాతోనే పరిష్కారం..!**

హైడ్రా తరహాలో నిడ్రా(నిర్మల్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) ఏర్పాటు చేస్తేనే చెరువులు, కందకాల పరిరక్షణ జరుగుతుందన్న వాదన పెరుగుతోంది. జిల్లాలో అడిషనల్ కలెక్టర్, డీఎస్పీ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కూడిన లేక్‌కమిటీ ఇప్పటికే పనిచేస్తోంది. తమకు వచ్చిన ఫిర్యాదులపై సమావేశాలు పెట్టుకుని, చర్యలను చేపడుతోంది. కానీ.. ఈ కమిటీ ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించలేకపోతోందన్న విమర్శలు ఉన్నాయి. రాజకీయ ఒత్తిళ్లతోపాటు ఆయా శాఖల్లో ఉద్యోగ, సిబ్బంది కొరత కూడా ఇబ్బంది కలిగిస్తోంది. ఉన్న కొంతమంది అధికారులపైనే ఇతర పనిభారం ఉండటంతో వారు కబ్జాలపై అంతగా దృష్టిపెట్టలేకపోతున్నారు. ఈనేపథ్యంలోనే ఆక్రమణలకు శాశ్వత పరిష్కారం కావాలంటే పూర్తిస్థాయిలో వాటిపై దృష్టిపెట్టి, చర్యలు చేపట్టే హైడ్రా తరహా ఆపరేషన్ అవసరం.

**సీఎం ప్రకటనతో ఆశలు..**

తాజాగా ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల్లో వరదలతో ముంపు పెరగడంతో సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ప్రకటించారు. చెరువులు, నాలాల కబ్జాల కారణంగానే వర్షాకాలంలో ముంపు పెరుగుతోందని పేర్కొన్నారు. జిల్లాలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. రెండు రోజుల క్రితం నిర్మల్‌లోని జీఎన్‌ఆర్ కాలనీ పరిశీలనకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు సైతం అక్కడ కాలువను ఆక్రమించడం వల్లే ముంపు పెరుగుతోందని, ముందుగా ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కుభీర్‌లోనూ కందకాల ఆక్రమణలతోనే ఆస్పత్రిలో నీరు నిలుస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని చెరువులు, కందకాలు, మురికి కాలువలనూ వదలకుండా కబ్జాలు చేసినందునే ఏడాదికేడాది ముంపు సమస్య పెరుగుతూ వస్తోంది. ఇది ఇలాగే సాగితే త్వరలోనే ఖమ్మం, వరంగల్ తరహాలో నిర్మల్ కూడా మునిగిపోవడం ఖాయమంటున్నారు. ఆలోపే సీఎం ప్రకటించిన మేరకు నిడ్రా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.







**ఉత్తమ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు**


నిర్మల్ జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశ్వర్‌రావు, కమిషనర్ నర్సింహారెడ్డి తదితరుల చేతుల మీదుగా కూన రమేశ్, దాసరి శంకర్, పల్సి శ్రీనివాస్ సత్కారు పొంది.. అవార్డు స్వీకరించారు.

# ఉపాధ్యాయులు.. సమ సమాజ నిర్మాతలు



ఉత్తమ పురస్కారం అందుకున్న ఉపాధ్యాయులు

- విద్యార్థికి పాఠశాల దశ అత్యంత కీలకం
- కలెక్టర్ అభిలాష అభినవ్
- విద్యకు ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే బొజ్జు
- ఘనంగా గురుపూజోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయులు సమ సమాజ నిర్మాతలని.. విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి దిశా నిర్దేశం చేసేది గురువే అని.. తమ ఉన్నతికి కారణమైన గురువులను జీవితకాలం గుర్తుంచుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్‌కే. ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఉత్తమ గురువుల సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లి జీవితాన్ని ఇస్తుందని, ఉపాధ్యాయులు ఆ జీవితాన్ని సజావుగా గడపడానికి అవసరమైన జ్ఞానాన్ని అందిస్తారన్నారు. విద్యార్థికి పాఠశాల దశ ఎంతో కీలకమన్నారు. సమాజ నిర్మాణంలో గురువు పాత్ర మరువలేనిదన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎంత మంచితనం నేర్పిస్తే అంత ఎక్కువగా పేరు వస్తుందని సూచించారు. కొందరు ఉపాధ్యాయులు మారుమూల ప్రాంతాలకు వెళ్లి పనిచేస్తున్నారని ప్రత్యేకంగా అభినందించారు. సమాజానికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను గుర్తించి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏటా ప్రభుత్వం అవార్డులతో సత్కరిస్తుందన్నారు. అవార్డు గ్రహీతలను అభినందించారు.

**విద్యారంగానికి పెద్దపీట..**

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. పది నెలలుగా ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో టీచర్ల పాత్ర ముఖ్యమైందన్నారు. ప్రభుత్వం అందజేసే అవార్డులతో వారిపై బాధ్యత మరింత పెరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాఠశాలలను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించామన్నారు. టీచర్ల ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు. విద్యార్థుల జీవితాలను సమున్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వివిధ కేటగిరీలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 135 మందిని సత్కరించి ప్రశంసాపత్రం, జ్ఞాపికలు ప్రదానం చేశారు. మొదటిసారిగా కలెక్టర్ చొరవతో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో ఉత్తమ అధ్యాపకులను ఎంపిక చేసి వారిని సన్మానించారు. డీఈవో రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఐఈవో పరశురాం, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు...**

కార్యక్రమంలో విజయ హైస్కూల్, జామ్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. గురువులకు పాదాభివందనం చేస్తూ.... గురువుల గొప్పతనాన్ని వివరిస్తూ వివిధ కళారూపాలు ప్రదర్శించారు.

## క్లుప్తంగా

### 9న జిల్లాస్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాలలో ఈనెల 9న జూనియర్స్ బాల, బాలికల బేస్‌బాల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుల శ్రీనివాస్, రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 2007 జనవరి 1 నుంచి 2009 జనవరి 1 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణపత్రం, బోనాఫైడ్, బర్త్ సర్టిఫికెట్లతో సోమవారం ఉదయం 10 గంటలకు పోటీల కన్వీనర్, పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, పోటీల ఆర్గనైజర్లు బి.గౌతమ్, హరీశ్‌లకు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### దాడిచేసిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ ఎజాజ్ తన బావమరిది అయిన షేక్ మునాక్‌పై దాడి చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తరచూ తన ఇంటికి వస్తూ గొడవలకు దిగుతున్నట్లు తెలిపారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల శివారు ప్రాంతంలో గల గ్రీన్‌వ్యాలు కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం ..రామకృష్ణ తన కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ధర్మపురికి వెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇంట్లో నాలుగు తులాల బంగారం, నాలుగున్నర తులాల వెండిపట్టి గొలుసులు ఎత్తుకెళ్లారని బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఒకరికి ఏడురోజుల జైలు

జైపూర్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ చెన్నూర్ సివిల్ కోర్టు జడ్జి రవి తీర్పునిచ్చారని జైపూర్ ఎస్సై శ్రీధర్ తెలిపారు. గురువారం జైపూర్‌లో పోలీసులు వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాన్నాయిపేటకు చెందిన వెంకటేశ్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తాగినట్లు తేలింది. కేసు నమోదు కేసుకుని చెన్నూర్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఈ మేరకు తీర్పునిచ్చారని ఎస్సై తెలిపారు.

### ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లాలోని పలు ఏరియాల్లో బైక్‌లు దొంగిలించి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద ఎస్సైలు సనత్, సురేశ్ సిబ్బందితో కలిసి గురువారం వాహనాలు తనిఖీ చేపట్టారు. నిమ్మల కుమార్, నెల్లి సాయికుమార్‌లు ధ్రువపత్రాలు లేని బైక్‌లు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని విచారించగా మంచిర్యాల, లక్సెట్టిపేట, కాసిపేటలో పలు బైకులు దొంగిలించామని ఒప్పుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు బైక్‌లతోపాటు చున్నంబట్టిలో ఓ ఇంట్లో దాచిన మరో నాలుగు బైకులు స్వాధీనం చేసుకుని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.




నిర్మల్‌లోని గ్రంథాలయంలో సన్నద్ధమవుతున్న యువత (ఫైల్)

చదువే లోకం..

# పుస్తకంతో మమేకం

- సర్కారు కొలువే లక్ష్యం..
- గ్రూప్స్‌పై ఉమ్మడి జిల్లా యువత గురి
- గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ

నిర్మల్‌ఖిల్లా: సర్కారు కొలువే లక్ష్యంగా గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉమ్మడి జిల్లా యువత సిద్ధమవుతున్నారు. రాత్రి,పగలు గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కాలెండర్ విడుదల చేయడం, టీజీపీఎస్సీ..అక్టోబర్ 21 గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు, నవంబర్, డిసెంబర్‌లో గ్రూప్–2 గ్రూప్–3 పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. ఉన్న సమయానికి అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చదువుతూ ప్రిపేరవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో పలు పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఈ పోటీ పరీక్షలకు దాదాపు 50 వేలకు మందికి పైగా యువత సన్నద్ధమవుతున్నారు. దాదాపు 40 శాతం మందికిపైగా గ్రంథాలయాల్లో, అద్దెకు తీసుకున్న గదుల్లో ప్రిపేరవుతుండగా మరో 30 శాతం మంది హైదరాబాద్, వరంగల్ తదితర నగరాల్లో కోచింగ్ తీసుకుంటున్నారు. గత జూన్ 9న నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను ఉమ్మడి జిల్లా నుంచి 15వేలకుపై అభ్యర్థులు రాశారు. ఇందులో అర్హత సాధించినవారికి వచ్చే అక్టోబర్‌లో మెయిన్స్ పరీక్షలకు హాజరుకానున్నారు. గ్రూప్–1తోపాటు గ్రూప్–2, గ్రూప్–3 పరీక్షలు నిర్వహించనుండడంతో తదనగుణంగా ప్రిపేరవుతున్నారు.

**జాబ్ కాలెండర్ ప్రకటనతో ఉత్సాహం..**

రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కాలెండర్ విడుదలతో నిరుద్యోగుల్లో ఉత్సాహం నెలకొంది. నిర్ణీత గడువులోనే ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తికానున్నట్లు వారి నుంచి ఆశాభావం వ్యక్తమవుతోంది. పరీక్ష నిర్వహణ తేదీలు ప్రకటించడంతో ప్రణాళిక బద్ధంగా ప్రిపేర్ అవుతున్నారు. వరుస పోటీ పరీక్షల నేపథ్యంలో కోరుకున్న కొలువు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఇందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే మెటీరియల్, పుస్తకాలను అందుబాటులో ఉంచడంతో వాటిని వినియోగించుకుంటున్నారు.

**గురిపెడితే కొలువు సులువే..**

నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల కేంద్ర గ్రంథాలయాలతో పాటు బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళు నిరుద్యోగుల కోసం దోహదపడుతున్నాయి. ఇందులో ఉద్యోగాలకు శిక్షణ పొందుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం కష్టపడితే ఉద్యోగ సాధన తర్వాత భవిష్యత్ బాగుంటుందని, ప్రభుత్వ కొలువుల్లో ఎలాగైనా సాధించాలని తపనతో శ్రమిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా సిద్ధమైతే పోటీ పరీక్షల్లో నెగ్గి సర్కారు కొలువు సాధించడం కష్టమేమీ కాదని గత విజేతలు పేర్కొంటున్నారు.

**ప్రణాళికాబద్ధంగా చదవాలి**



పోటీ పరీక్షలకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చదవాలి. సిలబస్ ఆధారిత ప్రిపరేషన్ అవసరం. సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి. తెలంగాణ ఉద్యమం, చరిత్ర, దేశ, రాష్ట్ర భౌగోళిక స్వరూపాలు, పర్యావరణం సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలను ప్రాధాన్యతనిచ్చి చదవాలి.

– రమణాగౌడ్ గొడిసెల, పోటీ పరీక్షల నిపుణుడు

**ఒత్తిడికి గురికావొద్దు**



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న తరుణంలో మానసికంగా ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఆందోళన, భయం లేకుండా ప్రశాంతంగా చదవాలి. మానసికంగా ఒత్తిడికి గురికాకుండా ప్రిపరేషన్ కొనసాగించాలి. లక్ష్యంపై దృష్టిసారించి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి.

– వెల్మల మధు, అసోసియేట్ ప్రొఫెసర్, నిర్మల్

# ఏజెన్సీలో అలజడి!

- పరిస్థితిని ముందే అంచనా వేయలేదా?
- దాడుల తర్వాత తేరుకున్న వైనం..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మహిళపై దాడి ఘటన చినికి చినికి గాలివానగా మారి రెండు ప్రధాన వర్గాల్లో దాడులు చేసే స్థాయికి చేరింది. పచ్చని అడవుల్లో ప్రశాంత జీవనానికి మారుపేరుగా ఉండే గూడేల్లో ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనతో శాంతిభద్రతలు చక్కబెట్టేందుకు ఉమ్మడి జిల్లా పోలీసు యంత్రాంగం, ఇతర జిల్లాల ప్రత్యేక బలగాలను మొహరించాల్సి వచ్చింది. చివరికి రాష్ట్ర అడిషనల్ డీజీ(లా అండ్ ఆర్డర్) రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఇరువర్గాల మధ్య సున్నితమైన అంశం కావడంతో అధికారులు, పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంతో వ్యవహరించాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు ఎస్పీలు, ఓ డీసీపీతోపాటు మరో ఇద్దరు ఎస్పీలు, ఓ డీసీపీ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సమన్వయం పాటించేందుకు ఇరువర్గాలతో చర్చించారు. ఆంక్షలు అమలు చేస్తూ ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. వ్యాపారాలు నిర్వహిస్తున్న మరోవర్గం ఆస్తులపైనా దాడులు జరిగాయి. ఈ పరిస్థితిని పోలీసు యంత్రాంగం ముందే అంచనా వేయలేకపోయిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఏజెన్సీలో జరిగిన ఘటనలు గుర్తున్న పోలీసు అధికారులెవరైనా ముందస్తు చర్యలు తీసుకుంటారు. కానీ మరోసారి పరిస్థితి చేయిదాటే వరకు వెళ్లడంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. బాధిత మహిళపై దాడి జరిగిన మూడు రోజుల వరకు రోడ్డు ప్రమాదంగానే భావిస్తూ, వాస్తవ పరిస్థితిని తెలుసుకోలేకపోయారా..? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పోలీసు యంత్రాంగం మాత్రం వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు.

**ప్రశాంత అడవిలో..**

ఏజెన్సీలో జరిగిన పలు ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి. శాంతిభద్రతలు నెలకొలడంలో సమస్యలు తెచ్చాయి. 2017లో ఆదివాసీ, లంబాడా వివాదంలో ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌పై దాడి చేసి, కలెక్టర్ కారు అద్దాలు, ఆఫీసులో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఉట్నూరు, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలోనూ నిరసనలు జరిగాయి. ఆ కేసుల్లో పలువురు ఆదివాసీలపై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనపై సీరియస్‌గా తీసుకున్న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల ఎస్పీలను బదిలీ చేసింది. ఏజెన్సీలో పరిస్థితిని చక్కబెట్టడంలో విఫలమయ్యారనే కారణంగా ఆ స్థానాల్లో కొత్త అధికారులను నియమించింది. మరోవైపు ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీలో మొదలై వివాదం ఇతర జిల్లాలకు వ్యాప్తి చెందడంతో పరిస్థితి అదుపులోకి వచ్చేందుకు నెలల సమయం పట్టింది. ఆ సమయంలోనూ ఇంటర్నెట్ నిషేధంతోపాటు అనేక ఆంక్షలు అమలయ్యాయి.

- 2019లో ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపటార్‌లో ఓ దళిత మహిళను ముగ్గురు వ్యక్తులు దారుణంగా అత్యాచారం చేసి చంపేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కుదిపేసింది. అప్పట్లో ఈ ఘటనపై జైనూరు కేంద్రంగానే స్థానికులు పెద్దఎత్తున ధర్నాలు, నిరసనలు చేపట్టారు. దీంతో ప్రత్యేక కోర్టులో విచారణ జరగగా నిందితులకు ఉరి శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది. కొద్దిరోజులకు గొడవ సద్దుమణిగింది.

**అంచనా వేయలేదా?**

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏజెన్సీలో పరిస్థితి ఎప్పటికప్పుడు చేయి దాటకుండా చూస్తున్నారు. ఆయా సంఘాల, నాయకులు ధర్నాలు, నిరసనలు, బంద్‌లకు పిలుపునిస్తే నిఘా వ్యవస్థతో సమాచారం తీసుకుని ఆదిలోనే నిలిపివేస్తున్నారు. వీటితో పాటు పాలన పరంగా మార్పులు తెచ్చారు. ఏజెన్సీలో 'పెసా' చట్టాన్ని అమలుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారు. పోలీసులు ఆదివాసీలకు మరింత దగ్గరవుతున్నారు. స్థానికంగా జరిగే సమస్యలు, అభివృద్ధిపైనా తమ ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఆదివాసీ గూడెల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్య, వైద్యం, యువతకు ఉపాధి, తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే తాజాగా జరుగుతున్న ఘటనల్లో మాత్రం ముందస్తుగా అంచనా వేయడంలో యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి.

# గంజాయి విక్రేతల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారంతో పట్టణ ఎస్సై రమేశ్ గురువారం స్థానిక మంచిర్యాల్ చౌరస్తా వద్ద గల చాచా టి సెంటర్ వద్ద ఉన్నాడు. ఆ సమయంలో చౌస్ అక్బార్, షేక్ రఫాయిలు ప్లాస్టిక్ కవర్‌లో గంజాయి తీసుకుని విక్రయించేందుకు వెళ్తున్నారు. ఎస్సై వారిని పట్టుకుని విచారించారు. మిత్రుడు మహమ్మద్ అయాన్‌తో కలిసి గంజాయి విక్రయిస్తున్నామని, భైంసాకు చెందిన బారీ వద్ద కొనుగోలు చేసి నిర్మల్‌లో విక్రయిస్తున్నట్లు వారు ఒప్పుకున్నారు. వారివద్ద నుంచి సుమారు 1.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సారంగపూర్: జల్సాలకు అలవాటుపడి మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. నిర్మల్ డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. లక్ష్మణచాంద మండలంలోని వద్యాల్ నర్సాపూర్‌కు చెందిన బాత్‌నాసి ఆరీఫ్(19), నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌కు చెందిన షేక్ ఇమ్రాన్(19)..మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేశాడు. నిర్మల్ జిల్లా పరిసరాల్లో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సారంగపూర్ మండలం చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం పోలీసులు తనిఖీ చేస్తుండగా గంజాయితో సహా ఇద్దరు పట్టుబడ్డారు. కేసు నమోదు చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న నిర్మల్ రూరల్ సీఐ రామక్రిష్ణ, స్థానిక ఎస్సై శ్రీకాంత్, సీసీఎస్ ఎస్సైలు సాయి, రవిలను ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల అభినందించారు.

# వరకట్నం కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: వరకట్నం కేసులో భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు గురువారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ షాహిదకు ఖానాపూర్‌కు చెందిన షేక్ అయ్యూబ్‌తో 2021 అక్టోబర్ 24న వివాహం జరిగింది. పెద్దల సమక్షంలో జరిగిన పెళ్లికి రూ.50 వేల కట్నం ఇస్తామని కుటుంబీకులు ఒప్పందం కుదుర్చారు. నెల రోజుల వరకు కలిసి ఉన్నారు. వరకట్నం కోసం భర్త షేక్ అయ్యూబ్‌తోపాటు ఆయన తల్లి, అన్నదమ్ముళ్లు మానసికంగా, శారీరకంగా వేధింపులకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఆమె కుటుంబీకులకు తెలియజేసింది. కొన్నిరోజుల్లో ఇస్తామని కుటుంబీకులు నచ్చజెప్పినా వినకుండాపోయారు. వేధింపులు తట్టుకోలేక షాహిద 2022 మే 6న పట్టణంలోని రైల్వే పట్టాలపై ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదుతో టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ కేసు దర్యాప్తు చేపట్టారు. పీపీ సంజయ్‌కుమార్ వైరాగ్రే 19 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈమేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి వివరించారు.

# ప్రాణం తీసిన అతివేగం

- గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న బైక్
- ఒకరి మృతి..కేసు నమోదు


సంతోశ్ మృతదేహం

కడెం: అతి వేగం ఒకరి ప్రాణం తీసింది. అజాగ్రత్తగా బైక్ నడుపుతూ గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఒకరి మృతి చెందాడు. ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. కడెం మండలం బాబానాయక్‌తండా జీపీ పరిధిలోని గంగన్నపేట్‌కు చెందిన మర్సుకోల తిరుపతి, మడావి సంతోశ్‌లు గురువారం పల్సర్ బైక్‌పై జన్నారంలోని బంధువుల అంత్యక్రియలకు వెళ్తున్నారు. గండిపోచమ్మ ఆలయం–ఉడుంపూర్‌కు మార్గమధ్యలో అజాగ్రత్తగా బైక్ నడుపుతున్న తిరుపతి..గుర్తుతెలియని వాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొట్టాడు. బైక్ వెనుకాల కూర్చున్న సంతోశ్(35) కిందపడి తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదుతో తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# చికిత్స పొందుతూ బాలిక మృతి

- ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో చికిత్స పొందుతూ బాలిక మృతిచెందడం ఆందోళనకు దారితీసింది. ఖానాపూర్ పట్టణానికి చెందిన వీణ–మారుతి దంపతుల కుమార్తె ఉత్తర(12) ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో నిర్మల్‌లో న్యూరో ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం బాలిక మృతిచెందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని ఆరోపించారు. ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్ కుమార్, రామకృష్ణ ఆసుపత్రి వద్దకు చేరుకుని బంధువులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. బాలిక మృతి విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్యశాఖ అధికారులు ఆస్పత్రికి చేరుకుని కుటుంబీకుల నుంచి వివరాలు తీసుకున్నారు.

### గాయపడిన వ్యక్తి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడి గాయాలైన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఎస్సై గోపతి సురేశ్ కథనం మేరకు.. హాజీపూర్ మండలం దొనబండకు చెందిన మోతె సుధాకర్ (48) బుధవారం ఉదయం నిద్ర లేచి బయటకు వస్తుండగా ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### దాడి కేసులో జరిమానా

దండేపల్లి: భూతగాదా విషయంలో ఒకరిపై దాడికి పాల్పడిన ఇద్దరికి జరిమానా విధిస్తూ మంచిర్యాల అడిషనల్ సబ్‌కోర్టు జడ్జి అర్పిత మారంరెడ్డి గురువారం తీర్పునిచ్చారు. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. 2021 ఆగస్టు 29న దండేపల్లి మండలం పెద్దపేటకు చెందిన బొడ్డు రాజన్నను అదే గ్రామానికి చెందిన రవీందర్, హరికృష్ణలు భూ తగాదాల విషయంలో కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో అప్పటి ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్ చేశారు. కేసు విచారణ గురువారం పూర్తి కావడంతో, నిందితులిద్దరికి ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి ఈ మేరకు తీర్పు ఇచ్చారని ఎస్సై పేర్కొన్నారు.

### రైలు ఢీకొని వృద్ధుడి మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తుతెలియని రైలు ఢీకొని వృద్ధుడి మృతిచెందినట్లు కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..గంగాపూర్‌కు చెందిన వశాకే శంకర్ (72) కూలీ పని చేసుకుని జీవిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం పని నిమిత్తం రెబ్బెనకు వెళ్తున్నానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి బయల్దేరాడు. మార్గమధ్యలోని మండలకేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. స్టేషన్ మాస్టర్ అందించిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కాగా, మృతుడికి భార్య తానుబాయి, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

### చెరువులో పడి యువకుడి..

కోటపల్లి: మండలంలోని రాజారం గ్రా మానికి చెందిన తలా ండి శ్రావణ్‌కుమార్ (27)చెరువులో పడి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తపల్లి గ్రా మంలో బుధవారం బంధువులది సంవత్సరీకం కార్యక్రమానికి శ్రావణ్ వచ్చాడు. స్నానం చేయడానికి చెరువు వద్దకు వెళ్లగా లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. గమనించిన తోటి బంధువులు కుటుంబసభ్యులు, పోలీసులకు అందించారు. వారు అక్కడికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. గురువారం ఉదయం ఈతగాళ్లతో గాలించగా శ్రావణ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు ఎస్సై రాజేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ర్యాలీలు, సభలకు అనుమతి లేదు


ఉట్నూర్‌లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

- ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్/ఉట్నూర్‌రూరల్: జైనూర్ సంఘటన దృష్ట్యా జిల్లాలో ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, గుడిహత్నూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ మండలాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఆయా మండలాల్లో ఎలాంటి బంద్ లేదని పేర్కొన్నారు. బంద్‌కు ప్రయత్నించేవారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. జైనూర్ ఘటనకు కారకులైన వారిపై కేసులు నమోదైనట్లు తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా తిరగడం, అనవసరంగా బయటకు రావొద్దని పేర్కొన్నారు. ఉట్నూర్‌లో పోలీసు ప్రత్యేక బలగాలతో నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో డీఎస్పీ నాగేందర్ సీఐ, ఎస్సైలు ఉన్నారు.

# క్రిమీలేయర్ విధానం అమలు చేయాలి



మాట్లాడుతున్న కిన్నెర సిద్ధార్థ

నిర్మల్‌టౌన్: ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమీలేయర్ విధానం అమలు చేయడం ద్వారానే దళిత కులాలకు సమన్యాయం జరుగుతుందని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ అన్నారు. ఈ మేరకు ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు చేపట్టిన పాదయాత్ర గురువారం నిర్మల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు ఆరు లక్షల ఆదాయం, ఓసీలో మూడు లక్షల ఆదాయం మించితే క్రిమీలేయర్ విధానం అమలు చేస్తుండగా.. ఎస్సీ రిజర్వేషన్లలో మాత్రం అలాంటి విధానం లేకపోవడంతో ఎస్సీలలోని పేద వాళ్లు రిజర్వేషన్లు పొందలేకపోతున్నారని తెలిపారు. దళిత సంపన్నులు రిజర్వేషన్ వదులుకొని, పేద దళితులకు సహకరించాలని కోరారు. సమావేశంలో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న డీఈ

ఖానాపూర్: పేదలకు నూతన విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ అవకాశాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ నిర్మల్ డీఈ నాగరాజు తెలిపారు. మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని సీఎం రావు ఫంక్షన్‌హాల్‌లో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఏఈలు, సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రూ.825లకే విద్యుత్ కనెక్షన్ వస్తుందని తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించిందని చెప్పారు. ఆసక్తి గలవారు ఆధార్, ఫొటో, ప్రాపర్టీ టాక్స్, హౌస్ ఓనర్ సర్టిఫికేట్, తెల్ల రేషన్‌కార్డు, కులం సర్టిఫికేట్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం దస్తురాబాద్ ఏఈ శ్రీనివాస్‌కు ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఏడీ లక్ష్మణ్, ఏవో నరేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నీటి విడుదల

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరదనీటితోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతోంది. గురువారం గుడిపేట శివారులోని గోదావరిపై ఉన్న ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు గాను 145.60 మీటర్లు ఉండగా మొత్తం 20.175 టీఎంసీలకు గాను 16.100 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎల్లంపల్లికి ఇన్‌ఫ్లో ద్వారా 1.70 లక్షల క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 25 వేల క్యూసెక్కులు, కడెం నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులో కలుస్తోంది. ఔట్‌ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 316 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోని 32 గేట్లు తెరిచి 1.65 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు.